కృషి, పట్టుదలతోనే లక్ష్య సాధన

ఐజీ త్రివిక్రమవర్మ



ఐజీని సత్కరించి జ్ఞాపిక బహూకరిస్తున్న మట్టుపల్లి మోహన్

గుంటూరు ఎడ్యుకేషన్: కృషి, పట్టుదలతో నిర్దేశిత లక్ష్యాన్ని సాధించగలమని గుంటూరు రేంజ్ ఐజీ డాక్టర్ సీఎం త్రివిక్రమవర్మ పేర్కొన్నారు. బ్రాడీపేటలోని మాస్టర్ మైండ్స్ విద్యాసంస్థ రవిభవన్ క్యాంపస్‌లో గురువారం సీఏ ఇంటర్ విద్యార్థులకు మోటివేషన్ తరగతుల్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఐజీ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే ప్రతి ఒక్కరూ లక్ష్యాన్ని ఎంచుకుని, దాన్ని అధిగమించేందుకు కష్టపడాలని సూచించారు. పట్టుదల, కృషి, ఆసక్తి గల వారు లక్ష్య ఛేదనలో ముందుంటారని తెలిపారు. సీఏ కోర్సు పూర్తి చేసిన వారికి ప్రపంచవ్యాప్తంగా అపారమైన ఉద్యోగావకాశాలు ఉన్నాయని, వారు దేశ ఆర్థిక ప్రగతిలో ప్రధాన భూమికి పోషిస్తున్నారని చెప్పారు. చదువును కష్టంగా కాకుండా ఇష్టపడి చదివేందుకు ప్రయత్నించాలని విద్యార్థులకు సూచించారు. జ్ఞాపికశక్తిని పెంచుకునేందుకు పాటించాల్సిన మెళకువలతో పాటు సమయపాలన గురించి సలహాలు ఇచ్చారు. కష్టపడి చదువుకుని ప్రస్తుతం ఉన్నతస్థాయిలో ఉద్యోగాలు చేస్తున్న ప్రముఖుల గురించి వివరించారు. మాస్టర్ మైండ్స్ డైరెక్టర్ మట్టుపల్లి మోహన్ మాట్లాడుతూ విద్యార్థులు ఏకాగ్రతతో తరగతులకు హాజరై పరీక్షల్లో విజయం సాధించాలని సూచించారు. చదువుపై ఆసక్తిని అలవర్చుకోవడం ఎంతో ముఖ్యమని, ప్రతి విద్యార్థికి ఏకాగ్రత, క్రమశిక్షణ, మానసిక ప్రశాంతత అవసరమని తెలిపారు.

క్లుప్తంగా

రేషన్ బియ్యం పట్టివేత



నగరంపాలెం: అక్రమంగా వాహనంలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు గురువారం పట్టుకున్నారు. సీఐ శ్రీహరిరావు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు నగర శివారులోని బుడంపాడు గ్రామంలోని ఓ రేషన్ దుకాణానికి సంబంధించిన బియ్యాన్ని బొలేరో వాహనంలో తరలిస్తున్నారన్న సమాచారంతో నల్లపాడు వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించారు. అక్రమంగా తరలిస్తున్న 60 బస్తాలు (32 క్వింటాళ్లు) పీడీఎస్ బియ్యం ఉన్న వాహనాన్ని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. బియ్యం తరలిస్తున్న వేమవరం గ్రామానికి చెందిన బి.శంకరరావుపై కేసు నమోదు చేసి నల్లపాడు పీఎస్‌లో అప్పగించారు.

అధ్యాపకురాలు సంధ్యాకోల్‌కు వీసీ అభినందన



ఏఎన్‌యూ: అంతర్జాతీయ శాస్త్రవేత్తల పురస్కారాల విభాగంలో 'మహిళా పరిశోధనా పురస్కారం' పొందిన నాగార్జున యూనివర్సిటీ ఫిజిక్స్ విభాగ అధ్యాపకురాలు సంధ్యా కోల్‌ను గురువారం వీసీ పి. రాజశేఖర్ అభినందించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ యూనివర్సిటీ అధ్యాపకురాలు అంతర్జాతీయ పురస్కారాన్ని పొందడంతో పాటు అమెరికాకు చెందిన అంతర్జాతీయ జర్నల్‌కు ఎడిటోరియల్ మెంబర్‌గా నియామకం కావడం గర్వకారణమని తెలిపారు. కార్యక్రమంలో ఫిజిక్స్ విభాగ అధ్యాపకులు ఆర్‌వీఎస్ఎస్ఎన్ రవికుమార్, నాగరాజు, కెమిస్ట్రీ విభాగ అధ్యాపకుడు బాలమురళి, పరిశోధకులు పాల్గొన్నారు.

నేటి నుంచి తిరుపతమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం

గుంటూరు రూరల్: 48వ డివిజన్ రెడ్డిపాలెంలోని తిరుపతమ్మ, గోపయ్య స్వామి ఆలయ 11వ వార్షికోత్సవ వేడుకల్ని శుక్రవారం నుంచి ప్రారంభించనున్నట్లు కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగే ఉత్సవాల్లో 3న ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 4న విశేష కుంబాభిషేకం, సాయంత్రం గ్రామోత్సవం, 5న సామూహిక దంపతులతో అమ్మ కల్యాణం, మహాన్నదానం నిర్వహిస్తున్నట్లు వివరించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని ఆలయ కమిటీ వ్యవస్థాపక కార్యదర్శి కోనూరి సతీష్ శర్మ తెలిపారు.

కన్నుల పండువగా శ్రీవారి కల్యాణం



గుంటూరు రూరల్: గోరంట్లలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు కమిటీ ఆధ్వర్యంలో కన్నుల పండువగా నిర్వహిస్తున్నారు. మూడు రోజులుగా జరుగుతున్న కార్యక్రమాల్లో భాగంగా గురువారం స్వామి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. వందలాది మంది దంపతులు పీటలపై కూర్చుని ప్రత్యేక పూజలు, వ్రతాలు, అభిషేకాలు, హోమాల్ని జరిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు గజవల్లి వెంకటప్పారావు, ప్రధాన కార్యదర్శి మేడా సాంబశివరావు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

గుంటూరు రూరల్: గోరంట్ల గ్రామ శివారులోని ఓ ఇంటిలో పేకాట ఆడుతున్నారని సమాచారం మేరకు గురువారం దాడి చేసినట్లు సీఐ శ్రీనివాసరావు తెలిపారు. ఎనిమిది మంది జూదరుల్ని అరెస్టు చేసి రూ. 85 వేలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసి కోర్టుకు అప్పగించనున్నట్లు సీఐ తెలిపారు.

పెదకాకానిలో నకిలీ అధికారుల వసూళ్లు ?

పెదకాకాని: తూనికలు కొలతల అధికారుల మంటూ నగదు వసూలు చేసిన సంఘటన పెదకాకానిలో చోటు చేసుకుంది. గ్రామంలోని ఆర్చి సెంటర్ ఎదురుగా గణేష్ సింగ్ అనే యువకుడు (మార్వాడి) మిఠాయి బండి పెట్టుకున్నాడు. గురువారం బైక్‌పై ఇద్దరు వ్యక్తులు వచ్చి తూనికలు, కొలతల విభాగానికి చెందిన అధికారులుగా పరిచయం చేసుకున్నారు. అతని బండిపై ఉన్న ఎలక్ట్రానిక్ కాటాకు సీల్ ముద్ర ఉందా? అని ప్రశ్నించారు. సీల్ లేదంటూ రూ. 700 రసీదు రాసి చేతికి ఇచ్చారు. ఇప్పుడే వచ్చానని, తన వద్ద రూ. 200 మాత్రమే ఉన్నాయని చెప్పడంతో రశీదు వెనుక రూ. 500 డ్యూ అని రాసి అక్కడి నుంచి వెళ్లిపోయారు. వారు ఇచ్చిన రశీదుపై ఎస్. శివ కుమారి అని సంతకం పెట్టడం, గ్రామంలో ఒకే ఒక్క బండిపై కాటా తనిఖీ చేయడం చూసి స్థానికులు నకిలీ తూనికల కొలతల అధికారులుగా చర్చించుకుంటున్నారు.

ఏఎన్‌యూలో ముగిసిన జాతీయ సదస్సు



సదస్సు ముగింపు సభలో ప్రసంగిస్తున్న రిజిస్ట్రార్ కరుణ

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో 'అడ్వాన్సస్ ఇన్ ఫైటోమెడిసిన్ అండ్ ఫైటోనానోకంపోజిట్స్' అనే అంశంపై రెండు రోజులు నిర్వహించిన జాతీయ సదస్సు గురువారం ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు యూనివర్సిటీ రిజిస్ట్రార్ బి. కరుణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ప్రసంగిస్తూ రోగాల్ని తగ్గించడానికి పూర్వీకులు ఉపయోగించిన మూలికా వైద్యం నేడు సాంకేతికంగా నిర్ధారించబడినట్లు తెలిపారు. కరోనా కారణంగా మొక్కల నుంచి సేకరించే సహజ సిద్ధ మందులు వాడకం పెరిగిందని చెప్పారు. వైద్యులు మందులతో వైద్యం చేస్తే, వాటిని తయారు చేసేవారు ఫార్మసిస్టులు అని పేర్కొన్నారు. ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రమీలారాణి మాట్లాడుతూ సంప్రదాయ వైద్యం ప్రాముఖ్యత పెరిగిందని, దీనిపై పరిశోధనలు కొనసాగించాలని తెలిపారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న కంబైన్డ్ బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ ఇన్ ఫార్మసీ, చిప్స్ కళాశాల ప్రిన్సిపాల్ సూర్యదేవర విద్యాధర్ ప్రసంగిస్తూ రోగాల్ని తగ్గించడానికి కొత్త ఆల్లోపతి మందులు ఎన్ని వచ్చినా సైడ్ ఎఫెక్ట్స్ తక్కువగా ఉండి శక్తివంతంగా పనిచేసే ఆయుర్వేద మందుల ఆవశ్యకత పెరిగిందని తెలిపారు. రెండవ రోజు జరిగిన ప్లీనరీ సెషన్‌లో అట్లాంటిస్ ఫైటోటెక్ చీఫ్ ఆపరేషన్ ఆఫీసర్ డాక్టర్. కె. బాబూరావు ప్రసంగిస్తూ మొక్కల సెకండరీ మెటబొలైట్స్ అయిన ఆల్కలాయిడ్స్, స్టెరాయిడ్స్, ఫినోలిక్స్, ఫ్లావనాయిడ్స్ వంటివి మందులు తయారీలో ఉపయోగపడతాయని తెలిపారు. ఢిల్లీ ఫార్మసిటికల్ సైన్స్ రీసెర్చ్ విశ్వవిద్యాలయ అధ్యాపకులు డాక్టర్. ఎం. ఆర్యలక్ష్మి మాట్లాడుతూ నానో టెక్నాలజీని ఉపయోగించి గ్రీన్ సింథసిస్ ద్వారా శక్తివంతమైన మందుల్ని తయారు చేయవచ్చని చెప్పారు. అసోసియేషన్ ఆఫ్ ఫార్మసోర్టికల్ టీచర్స్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ శాఖ సెక్రటరీ, వి.జె.ఎస్ ఫార్మసీ కళాశాల రాజమండ్రి ప్రిన్సిపాల్ డాక్టర్.డి.నరేంద్ర ప్రసంగిస్తూ కరోనాతో సంప్రదాయ వైద్యం ప్రాముఖ్యత పెరిగిందని పేర్కొన్నారు. ముగింపు సభలో సెమినార్ డైరెక్టర్ డాక్టర్ పి. రవి రెండు రోజులపాటు జరిగిన కార్యక్రమ వివరాల్ని నివేదించారు. కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల అధ్యాపకులు డి.రవిశంకర్‌రెడ్డి, యు.అన్నపూర్ణ, పి.రోహిణి, కె. సుజన, ఎం. గాయత్రీ రమ్య, కె.ఈ.ప్రవళిక, సీహెచ్. సజిని, షేక్ మస్తానమ్మ పాల్గొన్నారు.

శ్రీకృష్ణ ఆశ్రమం అభివృద్ధికి ఆర్థికసాయం



కొరిటెపాడు(గుంటూరు): పల్నాడు జిల్లా మోర్జంపాడులోని శ్రీ కృష్ణ అచల సిద్ధాంత ఆశ్రమం అభివృద్ధికి రూ.50,116 ఆర్థికసాయాన్ని వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్ అందజేశారు. అరండల్‌పేటలోని వేద సీడ్స్ ప్రధాన కార్యాలయంలో గురువారం ఆయన చెక్కును ఆశ్రమ నిర్వాహకుడు ఎం.రామానుజా సూరికి అందజేశారు. ప్రతిరోజూ జ్ఞాన, భగవద్గీత బోధన, అన్నదానం ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో యాడ్ ఫిల్మ్ డైరెక్టర్ అనిల్, ఆశ్రమ భక్తులు, పలువురు మోర్జంపాడు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన



ప్రాజెక్టును తిలకిస్తున్న డాక్టర్ పాతూరి కిరణ్, రఘురాం, సుధా మాధవి

గుంటూరు ఎడ్యుకేషన్: శ్యామలానగర్‌లోని శ్రీవేంకటేశ్వర బాలకుటీర్‌లో గురువారం ఎల్‌కేజీ నుంచి 5వ తరగతి విద్యార్థులు ఏర్పాటు చేసిన విద్యా, వైజ్ఞానిక, లలిత కళా ప్రదర్శన ఆకట్టుకుంది. ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యుడు పాతూరి కిరణ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రదర్శన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎల్‌కేజీ, యూకేజీ చిన్నారులు చెప్పిన కథలు, సామెతలు, చక్కని భాష, భావంతో వ్యక్తీకరించిన తీరు అలరించింది. ఏక్ భారత్ శ్రేష్ట భారత్ నినాదంతో ప్రదర్శించిన కూచిపూడి నృత్యం సందర్శకుల్ని ఆకట్టుకుంది. వాయిద్య పరికరాలతో సంగీతాన్ని వీనులు విందుగా అందించడంతో పాటు గణిత శాస్త్రంలోని ఫార్ములాలు, డెఫినేషన్స్, లెర్నింగ్ బై డూయింగ్ ద్వారా ప్రదర్శించిన విధానం బాగుంది. ఆంధ్ర-పంజాబ్ రాష్ట్రాల్లో జరిగే పండుగలు, సంస్కృతి, సంప్రదాయాల్ని చక్కటి చిత్రాల ద్వారా ప్రదర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ పాతూరి కిరణ్ మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి నుంచే బాలలకు భాష, భావ వ్యక్తీకరణలో స్వేచ్ఛనిస్తే, భవిష్యత్తులో ఎన్నో అద్భుతాల్ని చేయగలరని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపక కార్యదర్శి దేవి, సంయుక్త కార్యదర్శి జయశ్రీ , సీఏఓ రఘురాం, ప్రిన్సిపాల్ సుధామాధవి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో గంజాయి విక్రయదారుడు ?

నగరంపాలెం: లిక్విడ్ గంజాయి విక్రయించే క్రమంలో పరారైన యువకుడ్ని ఎస్ఈబీ గుంటూరు-2 స్టేషన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఎస్ఈబీ గుంటూరు-2, డీఎస్ఈఓ బృంద పోలీసులు గుంటూరు క్లబ్ వద్ద వాహన తనిఖీల్లో గంజాయి విక్రయించే బేల్దారి మేస్త్రీ జె.వెంకటేశ్వర్లను బుధవారం అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ఈ సమయంలో పరారైన మారుతీనగర్‌కు చెందిన యువకుడ్ని గురువారం అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. ఎన్నాళ్లుగా విక్రయాలు చేస్తున్నారు.. ఎక్కడ నుంచి తీసుకువస్తున్నారనే? విషయాలపై ఆరా తీస్తున్నట్లు తెలిసింది.

బాలికను వేధిస్తున్న వ్యక్తికి దేహశుద్ధి

పట్నంబజారు: బాలిక వెంటపడి వేస్తున్న వ్యక్తికి దేహశుద్ధి చేసిన ఘటన నగరంలో చోటు చేసుకుంది. అరండల్‌పేట ఎస్ఐ ప్రవీణ్ తెలిపిన వివరాల ప్రకారం.. హనుమయ్యనగర్‌కు చెందిన 11 ఏళ్ల బాలికను ఓ దుకాణంలో పని చేస్తున్న వెస్ట్ బెంగాల్‌కు చెందిన అనుమూల్ అనే వ్యక్తి వెంటపడి వేస్తున్నాడనే కారణంతో బాలిక తల్లిదండ్రులు, బంధువులు దేహశుద్ధి చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు నిందితుడ్ని అదుపులోకి తీసుకున్నారు. చికిత్స చేయించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కేంద్ర బడ్జెట్‌పై ఎంబీఏ విద్యార్థుల విశ్లేషణ



విశ్లేషణ జరుపుతున్న విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతి రోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో ఎంబీఏ, ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ ప్రథమ సంవత్సర విద్యార్థులు గురువారం కేంద్ర బడ్జెట్‌పై విశ్లేషణ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు ఫార్మాస్యూటికల్ పరిశ్రమ, డయాగ్నోస్టిక్స్ పరికరాల పరిశ్రమపై బడ్జెట్ ప్రభావాన్ని వివరించి చెప్పారు. ఎంబీఏ విద్యార్థులు అంగన్‌వాడీ పోషక్, శక్తి తదితర గ్రూపుల వల్ల మాతా శిశు మరణాలను తగ్గించేందుకు ప్రతిపాదించిన అంశాల్ని వివరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ మాట్లాడుతూ మహిళా స్వయం సహాయక సంఘాల చిన్న పొదుపు మొత్తాలతో పాటు నూతనంగా ప్రవేశపెట్టిన పథకాలపై విద్యార్థులు పరస్పరం చర్చించుకుని అవగాహన పొందారని తెలిపారు. బడ్జెట్‌కు మూలాధారమైన సప్తరుషుల్లో సూక్ష్మ, రుణ సంస్థలైనటువంటి ఎంఎస్ఎంఈల ద్వారా చిరు వ్యాపారులకు ఏ విధమైన రాయితీలు కల్పించారనేది పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. విద్యార్థులు వ్యవస్థాపకులుగా ఎదిగి, ఉద్యోగాల్ని ఆశించే స్థాయి నుంచి కల్పించే స్థాయికి చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ కె. లలిత, ఎంబీఏ విభాగాధిపతి వి. చక్రవర్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.

భార్య స్కూటీని తగలబెట్టిన భర్త

చేబ్రోలు: మనస్పర్థల కారణంగా భార్య ద్విచక్ర వాహనాన్ని పెట్రోలు పోసి భర్త తగలబెట్టినట్లు గురువారం పోలీసులకు ఫిర్యాదు అందింది. చేబ్రోలు ఎస్ఐ కె. ఆనంద్ తెలిపిన వివరాల ప్రకారం.. చేబ్రోలు గ్రామానికి చెందిన కొలగాని ఫణీంద్ర ఇదే గ్రామానికి చెందిన మాధవి 2008లో ప్రేమించుకొని వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్యాభర్తల మధ్య మనస్పర్థల కారణంగా కొంతకాలంగా మాధవి పుట్టింటిలో ఉంటుంది. భార్య మీద కోపంతో వారం రోజుల కిందట అర్ధరాత్రి ఫణీంద్ర పెట్రోలు బాటిల్‌తో వెళ్లాడు. పుట్టింటి వద్ద ఉన్న ఆమె స్కూటీ మీద పోసి నిప్పంటించి తగలబెట్టాడు. స్థానికులు ఫణీంద్ర తగలబెట్టినట్లు మాధవికి చెప్పడంతో ఆమె చేబ్రోలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ ఆనంద్ కేసు నమోదు చేశారు. నిందితుడు ఫణీంద్రను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

ముగిసిన శ్రీ రామనామ సప్తాహ మహోత్సవాలు



పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

పాత గుంటూరు: స్థానిక బ్రాడీపేటలో శ్రీ సిద్ధేశ్వర పీఠ పాలిత ఓంకార క్షేత్రంలో శ్రీ సీతారామాంజనేయ నగర సంకీర్తన సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 89వ శ్రీరామనామ సప్తాహ మహోత్సవాలు, 93వ సంఘ వార్షికోత్సవాలు గురువారం ఉదయం శ్రీ రామ మహా సామ్రాజ్య పట్టాభిషేకం, శాంతి హోమం పూర్ణాహుతి, నగరోత్సవంతో ముగిశాయి. తొలుత ఆలయ పాలకమండలి శ్రీ రామ పాదుకల్ని తలమీద ఉంచుకొని అర్చకులు బుజ్జి బృందం వేద మంత్రాలతో ఆలయ ప్రదక్షిణ చేసింది. అనంతరం శ్రీ రామ మహా సామ్రాజ్య పట్టాభిషేకం , శాంతి హోమం, వసంతోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. విశేషంగా పాల్గొన్న భక్తులకు అన్నసమారాధన జరిపారు. సాయంత్రం విశేషంగా అలంకరించిన వాహనంలో పరివార దేవతలతో విద్యుత్ దీప కాంతులతో, శ్రీ రామనామ స్మరణతో, మేళతాళాలతో ఆలయం నుంచి తిరువీధుల్లో సీతారాముల ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమాన్ని సంఘ కార్యదర్శి నంబూరి వెంకట నారాయణమూర్తి పర్యవేక్షించారు.

బిల్డింగ్ పైనుంచి కిందపడి కార్మికుడి మృతి

పట్నంబజారు: బిల్డింగ్ చెక్క పనులు చేసుకునే కార్మికుడు ప్రమాదవశాత్తూ మృతి చెందిన సంఘటనపై కేసు నమోదైంది. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జాకీర్‌హుస్సేన్ నగర్‌కు చెందిన తోట నాగరాజు (36) బిల్డింగ్‌ల్లో చెక్క పని చేస్తుంటాడు. ఈ క్రమంలో గురువారం విద్యానగర్‌లోని ఒక బిల్డింగ్‌లో పని చేస్తూ, ప్రమాదవశాత్తూ ఐదో అంతస్తు నుంచి కింద పడ్డాడు. తోటి కార్మికులు జీజీహెచ్‌కు తీసుకుని వెళ్లగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

దేశ ప్రజలను నిరాశపరిచిన బడ్జెట్

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

పాత గుంటూరు: కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ దేశ ప్రజల్ని నిరుత్సాహపరిచిందని, సంపన్న వర్గాలకు పెద్దపీట వేసిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ విమర్శించారు. కొత్తపేటలోని సీపీఐ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఉపాధి హామీ పథకం ద్వారా లబ్ధి చేకూరుతుంటే, వారందరికీ 33 శాతం ఉపాధి పనుల్లో కోత విధించారని విమర్శించారు. పెట్రోలియం సబ్సిడీ, విద్య, వైద్యానికి కేటాయింపులు తగ్గించారని తెలిపారు. సాధారణ ప్రజల్ని బీజేపీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. కార్పొరేట్లకు మేలు చేకూర్చే విధంగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టారని తెలిపారు. మోదీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌పై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

బడ్జెట్‌లో మైనారిటీలకు అన్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న జియావుర్ రెహమాన్

పాత గుంటూరు: కేంద్ర బడ్జెట్‌లో మైనారిటీలకు నిధులు కేటాయింపులో బీజేపీ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని ముస్లిం ఐక్య వేదిక గౌరవాధ్యక్షుడు షేక్ జియావుర్ రహమాన్ విమర్శించారు. ఆనందపేటలోని తన కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మైనారిటీ కమ్యూనిటీలకు చెందిన విద్యార్థులకు ప్రొఫెషనల్, టెక్నికల్ కోర్సుల కోసం అనేక స్కాలర్‌షిప్‌ల సహా స్కిల్ డెవలప్‌మెంట్ పథకాలలో పెద్ద ఎత్తున నిధుల కోతను విధించిందని ధ్వజమెత్తారు. ఈ పథకాలకు గతేడాది రూ. 365 కోట్లు కేటాయించగా ఈ ఏడాది 44 కోట్లకు అంటే దాదాపు 88% కుదించారని విమర్శించారు. మైనారిటీల ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్ కోసం గత బడ్జెట్‌లో రూ. 1,425 కోట్లు కేటాయించగా, ఈ ఏడాది రూ. 433 కోట్లకు తగ్గించడంపై బీజేపీ వైఖరిని గమనించాలని తెలిపారు. ఉచిత కోచింగ్, అనుబంధ పథకాల కోసం గతేడాది రూ. 79 కోట్లు కేటాయించగా, ఈ సంవత్సరం బడ్జెట్లో 60% కోత విధంచి రూ. 30 కోట్లు కేటాయించడం అన్యాయమని ఖండించారు. మైనారిటీల విద్యా సాధికారత కోసం గత ఏడాది రూ. 2,515 కోట్లుగా ఉన్న మొత్తం కేటాయింపును, ఈ ఏడాది రూ. 1,689 కోట్లు కేటాయించడం విచారకరమని అన్నారు. మదరసాలు, మైనారిటీల కోసం విద్యా పథకానికి గత బడ్జెట్ కేటాయింపు రూ. 160 కోట్లు కాగా, ఈ ఆర్థిక సంవత్సరానికి నామమాత్రంగా రూ. 10 కోట్లు కేటాయించడం దారుణమని తెలిపారు. మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు గత సంవత్సరం బడ్జెట్‌లో రూ. 5020.50 కోట్లు కేటాయించగా, ఈ ఆర్థిక సంవత్సరానికి 2612.66 కోట్లు కేటాయించి మైనార్టీలపై బీజేపీ వైఖరిని తెలియచేసిందని వెల్లడించారు. సమావేశంలో ముస్లిం ఐక్య వేదిక మహిళా అధ్యక్షురాలు డాక్టర్ షమా సుల్తానా, కార్యదర్శి అబ్దుల్ కలాం, ఉపాధ్యక్షులు బాజీ, షేక్ సలీం , అన్సారీ, అల్లాబక్షు పాల్గొన్నారు.

ఫైబ్రో స్కాన్‌తో లివర్ పనితీరు నిర్ధారణ



ఫైబ్రో స్కాన్ పరీక్ష చేస్తున్న డాక్టర్ నాగూర్‌బాషా

గుంటూరు మెడికల్: ఫైబ్రో స్కాన్ పరీక్ష ద్వారా కాలేయంలోని కొవ్వు శాతం, కాలేయం గట్టితనం, లివర్ ఫైబ్రోసిస్ ఏదశలో ఉందనే విషయాలను ముందస్తుగానే తెలుసుకోవచ్చని ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు, కేర్‌వెల్ హాస్పిటల్ అధినేత డాక్టర్ షేక్ నాగూర్ బాషా తెలిపారు. లివర్ సమస్యతో బాధపడుతున్నవారికి గురువారం స్థానిక గుంటూరువారి తోట 7వ లైన్‌లోని హాస్పిటల్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఒక్కో రోగికి సుమారు రూ. 10 వేల విలువ చేసే ఫైబ్రో స్కాన్‌ను 60 మందికి ఉచితంగా చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగూర్ బాషా మాట్లాడుతూ ఆల్కాహాల్ తీసుకునే వారు, హెపటైటీస్ బీ, హైపటైటీస్ సీకి గురైన వారు, అధిక బరువు ఉన్నవారు, షుగర్ వ్యాధితో బాధపడేవారు ఫ్యాటీ లివర్‌కు గురయ్యే అవకాశం ఎక్కువగా ఉందని చెప్పారు. ఫ్యాటీ లివర్ వల్ల అది గట్టిపడి పని తీరు మందగిస్తుందని, దీన్ని దృష్టిలో పెట్టుకుని దీర్ఘకాలిక వ్యాధి బాధితులు ఫైబ్రోస్కాన్ పరీక్ష చేయించుకోవడం ద్వారా పాడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవచ్చని తెలిపారు. ప్రతినెలా రోగులకు తమ ఆసుపత్రిలో ఉచితంగా చేస్తున్న ఫైబ్రో స్కాన్ ఉచిత వైద్య శిబిరాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కేర్ వెల్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ షేక్ గౌస్ బాషా కోరారు.

జేఈఈ, నీట్‌కు ఉచిత శిక్షణ అభినందనీయం



శయన్ దంపతులతో పులుగు దీపక్, విద్యార్థినులు

గుంటూరు ఎడ్యుకేషన్: జాతీయస్థాయిలో జరిగే పోటీ పరీక్షలకైన జేఈఈ, నీట్‌కు ఉచిత శిక్షణ కల్పించడం అభినందనీయమని ఆంధ్రకేసరి ప్రకాశం ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు పీవీఎస్ శయన్ పేర్కొన్నారు. పండరీపురంలో గణితశాస్త్ర అధ్యాపకుడు పులుగు దీపక్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జేఈఈ, నీట్, ఏపీ ఈఏపీసెట్-2023 శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన శయన్ విద్యార్థులతో మాట్లాడారు. విద్యారంగం వ్యాపారమయంగా మారిన పరిస్థితుల్లో పేద, బడుగు, బలహీనవర్గాల విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇవ్వడం సామాన్య విషయం కాదన్నారు. పైసా ఖర్చు లేకుండా ఉచిత శిక్షణ ఇస్తున్న పులుగు దీపక్ భావితరాలకు మార్గదర్శకులుగా నిలిచారని కొనియాడారు. ఈ సందర్భంగా తాను స్వయంగా రూపొందించిన స్టడీ గ్రో అనే సాఫ్ట్‌వేర్ టూల్‌ను విద్యార్థులకు ఉచితంగా అందజేసిన శయన్, రూ.50వేలు విలువ గల ఐదు ట్యాబ్‌లను విద్యార్థులకు అందజేశారు. పులుగు దీపక్ మాట్లాడుతూ చేనేత బంధువుగా గుర్తింపు పొందిన మాజీ ఎంపీ ప్రగడ కోటయ్య తనయుడు పీవీఎస్ శయన్ తమ శిక్షణ కేంద్రాన్ని సందర్శించి, విద్యార్థులకు ఉచితంగా ట్యాబ్‌లను పంపిణీ చేయడం సంతోషదాయకమని తెలిపారు. ఈ సందర్భంగా శయన్ దంపతుల్ని సత్కరించారు.

బైక్‌ల చోరీ కేసులో నిందితుడి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సీతారామయ్య

పట్నంబజారు: ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న నిందితుడ్ని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. లాలాపేట పోలీసు స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశ మందిరంలో ఈస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ సీతారామయ్య, లాలాపేట పీఎస్ ఎస్‌హెచ్ఓ ఎన్.సుబ్బారావు వివరాలు వెల్లడించారు. చెడు వ్యసనాలకు బానిసై, సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో పాత గుంటూరు, సుద్దపల్లిడొంక, హోసన్న మందిరం సమీపంలో నివాసం ఉండే బత్తిని చంద్రశేఖర్ చోరీలకు పాల్పడుతున్నాడు. గతంలో ఆటో నడుపుకునే అతడు మద్యానికి బానిసై చోరీలకు అలవాటు పడ్డాడు. మారు తాళాలు తయారు చేసి, పార్కింగ్‌లో ఉన్న వాహనాలు చోరీలు చేస్తుంటాడు. ఈ క్రమంలో ఈనెల 1వ తేదీ సాయంత్రం చోరీ చేసిన వాహనాల్ని విక్రయించేందుకు సుద్దపల్లి డొంకలో ప్రయత్నిస్తున్న చంద్రశేఖర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి నాలుగు ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడ్ని పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన సిబ్బందిని డీఎస్పీ సీతారామయ్య అభినందించారు.

విజ్ఞాన్ యూనివర్సిటీ విద్యార్థికి పీహెచ్‌డీ ప్రదానం

చేబ్రోలు: తమ యూనివర్సిటీ ఈఈఈ విభాగ విద్యార్థి పి.పోతురాజుకు పీహెచ్‌డీ పట్టాను ప్రదానం చేసినట్లు వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ కార్యాలయం గురువారం తెలియజేసింది. ''డిజైన్ అండ్ ఇంప్లిమెంటేషన్ ఆఫ్ ఎంబెడెడ్ చాపర్ విత్ బై డైరెక్షనల్ డ్యూయల్ పోర్ట్ డీసీ-ఏసీ కన్వర్టర్ ఫర్ వైడ్ వోల్టేజ్ రేంజ్ అప్లికేషన్స్'' అనే అంశంపై పోతురాజు పరిశోధన చేశారని వెల్లడించింది.

ఆర్‌వీఆర్‌జేసీ కళాశాలకు మూడోసారి ఏఏ రేటింగ్

గుంటూరు రూరల్: నాణ్యతతో కూడిన విద్యా విధానాలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తును అందించడం తమ కళాశాల లక్ష్యమని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు ఆర్. శ్రీనివాస్ తెలిపారు. గురువారం చౌడవరంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఐఐటీ మద్రాస్ నిర్వహించిన ఎన్‌పీటీఈఎల్ ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సుల్లో తమ కళాశాల విద్యార్థులు కనబరిచిన ప్రతిభకు జాతీయ స్థాయిలో తొమ్మిదో ర్యాంకుతో ఏఏ రేటింగ్‌ను మూడోసారి అందజేసిందని తెలిపారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ ఆర్. గోపాలకృష్ణ మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి మంచి భవిష్యత్తును అందజేసేందుకు తమ కళాశాల కృషి చేస్తోందని పేర్కొన్నారు. మూడోసారి ర్యాంకు రావడం సంతోషంగా ఉందని చెప్పారు. ట్రెజరర్ కె. కృష్ణప్రసాద్ మాట్లాడుతూ వివిధ విభాగాలకు చెందిన కోర్సులకు 2928 మంది రిజిస్టర్ కాగా, అందులో 82 మంది విద్యార్థులు గోల్డ్, 843 మంది విద్యార్థులు ఎలైట్, 603 మంది విద్యార్థులు సిల్వర్, 91 మంది విద్యార్థులు టాపర్ సర్టిఫికెట్లను పొందారని వివరించారు. ఉత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థుల్ని కళాశాల డైరెక్టర్ కె. రవీంద్ర, డైరెక్టర్ , ఏవో ఎన్.వి.శ్రీనివాసరావు, ఎం.వి.పి. చంద్రశేఖర్ అభినందించారు.